# ఆరో వేలు

వాళ్ళిద్దరూ కలబడ్డారు. ఒకర్నొకరు రక్తం కారేలా కొట్టుకున్నారు. అయినా కసి తీరలేదు. ప్రత్యర్థిని చంపేయాలన్నంత కోపం వాళ్ళ కళ్ళలో నగ్నంగా... ఇద్దరూ ఎగిరి నీళ్ళలో పడ్డారు. ముష్టిఘాతాలు... నీళ్ళు చెల్లాచెదురౌతున్నాయి. ఒకడు మరొకణ్ణి నీళ్ళలో ముంచి వూపిరాడకుండా చేసి చంపే ప్రయత్నం చేశాడు. అప్పుడతను గిలగిలా కొట్టుకుంటూనే బూటు మడతల్లో దాచుకున్న కత్తి తీసి కడుపులో పొడిచాడు. అమ్మా అంటూ కేక... పొడిచినతను నీళ్ళ పైకి వచ్చి బలంగా వూపిరి తీసుకున్నాడు. అక్కడి నీళ్ళన్నీ కుంకుమ చల్లినట్లు ఎర్రగా మారిపోయాయి.

శనివారం సాయంత్రం టీవీలో వస్తున్న సినిమాలోని సీన్‌ని చాలా ఆసక్తిగా చూస్తున్నాడు రమేష్.. నీళ్ళు ఎర్రగా మారటం చాలా బావుంది. రక్తం రంగు పులుముకున్న నీళ్ళలో భీభత్సం కన్నా సౌందర్యం కన్పించింది.

"ఆ కొట్టుకోడాలూ చంపుకోడాలూ కళ్ళప్పగించి చూడకపోతే చదువుకోవచ్చుగా" అంది వాళ్ళమ్మ.

"నాకు ఫైట్స్ చాలా ఇష్టం మమ్మీ. సింహాద్రి సినిమాని ఫైట్స్ కోసమే నాలుగు సార్లు చూశాను తెలుసా" అదేదో ఘనకార్యంలా చెప్పాడు. సింహాద్రి సినిమాలో పరశురాముడి గొడ్డలిలాంటి ఆయుధంతో మనుషుల్ని చెరుకు గడల్ని నరికినట్లు హీరో నరకటం ఎంతగా నచ్చిందో అతనికి. మెడలు తెగి కొందరు... చేతులు, కాళ్ళు తెగి కొందరు... రక్తపు మడుగులో విలవిల్లాడుతూ...

"తొందరగా అన్నం పెట్టు. శీనుగాడింటికెళ్ళి చదువుకుంటాను" అన్నాడు టీవీ స్క్రీన్‌మీద నుంచి తల తిప్పకుండానే.

"శీనువాళ్ళింటికెందుకురా? మనింట్లోనే చదువుకోవచ్చుగా"

"శీనువాళ్ళ అమ్మానాన్న పెళ్ళికని విజయవాడ వెళ్ళారు. రెండ్రోజులదాకా రారు. అందుకే నేనూ రవి తోడుగా పడుకుంటామని చెప్పాం"

"సరే. టీవీలో సినిమాలు చూడకుండా బుద్ధిగా చదువుకో నాయనా. నీకు తెల్సుగా మీ నాన్న చదువుకోలేదు. కార్పెంటర్ పని చేసుకుంటూ కష్టపడి సంసారాన్ని లాక్కొస్తున్నాడు. నువ్వైనా బాగా చదువుకుని, ఉద్యోగస్థుడివైతే చూడాలని కోరిక"

"అబ్బ చెప్పిందే చెప్పి బోర్ కొట్టకు మమ్మీ. చదువుతాలే" విసుగ్గా అని మరలా టీవీమీద దృష్టి సారించాడు.

"ఎప్పుడూ ఆ సిన్మాలేమిట్రా... ఇటీ రిమోట్. వార్తలు పెడదాం" టీవి ముందు కూచుంటూ అన్నాడు వాళ్ళ నాన్న.

న్యూస్ ఛానెల్‌లో ఏవో వార్తలొస్తున్నాయి. రమేష్‌కి ఆసక్తి తగ్గిపోయింది.

"అమ్మా అన్నం పెట్టవే" అన్నాడు.

కంచంలో అమ్మ వడ్డించిన పదార్థాలవైపు చూడకుండా యాంత్రికంగా తింటూ కళ్ళని మాత్రం అనాయాసంగా టీవికి అతికించాడు.

'రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం' అనే వార్తను ప్రసారం చేస్తున్నారు.

స్కూటర్‌మీద వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు లారీ కింద పడి చచ్చిపోయిన వైనాన్ని ఆసక్తికరంగా చెప్తున్నారు. దాంతోపాటు క్లిప్పింగ్స్ చూపిస్తున్నారు. ఒకడి తల లారీ చక్రాల కింద పడి పగిలిపోయింది. మెదడు బైటికొచ్చి భీభత్సంగా ఉందా దృశ్యం. ఇంకో వ్యక్తి రక్తపు ముద్దలా ఉన్నాడు.

దాంతర్వాత మరో క్లిప్పింగ్ చూపించారు. లారీని, శవాల్ని తీసేశాక సంఘటనా స్థలం ఎలా ఉందో పది సెకన్ల వరకు చూపించారు. నల్లటి తార్రోడ్డు

మీద మడుగు కట్టిన ఎర్రటి రక్తం... ఈగలు ముసురుతూ...

"పిల్లాడు అన్నం తింటుంటే అలాంటివి చూపిస్తావెందుకు? ఆ టీవీ వాళ్ళకు బుద్ధిలేదు సరే నీకేమయ్యింది? పిల్లాడు జడుసుకుంటాడు" అంది వాడి అమ్మ.

అమ్మ అలా ఎందుకందో రమేష్‌కి అర్థం కాలేదు. చూడకూడనిది ఏముందందులో? ఎప్పుడూ కన్పించే దృశ్యమే. రోజుకొక్కసారైనా రహదారులు రక్తమోడుతుంటాయి. వాటిని న్యూస్ ఛానెళ్ళు రొటీన్‌గా మనసుకు హత్తుకునేలా చూపిస్తూ ఉంటాయి.

తొందరగా నాలుగు మెతుకులు తిని, పుస్తకాలు తీసుకుని బైట పడ్డాడు. రమేష్, రవీ, శీను ఇంటర్మీడియెట్ ఫైనలియర్ చదువుతున్నారు. రమేష్‌కి శీనువాళ్ళింటికెళ్ళడమంటే మహా సరదా. శీనుగాడి నాన్న బ్యాంక్ మేనేజర్. వాళ్ళింట్లో పెద్ద స్క్రీన్ ఉన్న టీవి ఉంది. సినిమాలు చూడటానికి విసిడీ ప్లేయర్ ఉంది. కంప్యూటర్ ఉంది. అన్నిటికీ మించి రకరకాల వీడియో గేమ్స్ ఉన్నాయి.

రమేష్ వెళ్ళేప్పటికే రవి వచ్చి ఉన్నాడు.

"శీనూ.. వీడియో గేమ్ పెట్టరా... 'రెసిడెంట్ ఈవిల్ జెరో' పెట్టు బావుంటుంది" అన్నాడు రమేష్ .

"ఒరేయ్... వీడికెప్పుడూ తన్నుకోడాలూ, రక్తం కారేలా నరుక్కోడాలూ, చంపుకోడాలూ ఉన్న గేమ్స్ అంటే ఇష్టం ఎందుకంటావు?" నవ్వుతూ రవితో అన్నాడు శీను.

"కొట్టుకోవటంలో ఓ థ్రిల్ ఉంటుంది. అందుకేగా సినిమాల్లో ఫైట్స్‌ని స్పెషల్‌గా కంపోజ్ చేస్తారు. నాకూ అలాంటివి ఇష్టమే" అన్నాడు రవి.

"చూసిన వీడియే గేమ్స్ మరలా చూడటం దేనికని ఈ రోజు కొత్త వీడియో గేమ్ తెచ్చాను" అన్నాడు శీను.

"బావుంటుందా?"

"ఏమో తెలీదు. దీని పేరు 'రూల్ ఆఫ్ రోజ్'. ఈ గేమ్ లండన్‌లో చాలా పాపులరట"

"ఏదీ లోడ్ చేయి చూద్దాం" అన్నాడు రవి ఉత్సాహంగా.

ఒక అందమైన అమ్మాయిని ఇద్దరు యువకులు కిడ్నాప్ చేస్తారు. ఓ గదిలో ఆ అమ్మాయిని బంధించి రకరకాల హింసలకు గురిచేస్తారు. ఎన్ని రకాలుగా చిత్రవధ చేయవచ్చో అన్ని ఆప్షన్స్ ఉన్నాయి గేమ్‌లో.

ఆడుతుంటే ...నిజంగానే ఒకమ్మాయిని తాము ముగ్గురూ కలిసి బంధించినట్లు... ఆమెని హింసిస్తున్నట్లు...అనుభూతి రమేష్‌కి.

"ఆ అమ్మాయి చిటికెన వేలు నరికి వాళ్ళ నాన్నకు పార్శిల్ చేస్తే భయపడిపోయి డిమాండ్ చేసినంత డబ్బులిస్తాడు" సలహా ఇచ్చాడు రవి.

"కుడి చేతిని మణికట్టుదాకా కట్ చేసి వాళ్ళ నాన్నకు పంపిస్తే ఇంకా ఎఫెక్టివ్‌గా ఉంటుంది" అన్నాడు రమేష్. .

"రక్తస్రావంతో చచ్చిపోతుంది" అన్నాడు శీను.

"అసలిదంతా దేనికి? ఏకంగా చంపేస్తే పోలా" బాగా ఎగ్జయిట్ అవుతూ అన్నాడు రవి.

"పిచ్చోడిలా ఉన్నావే. చంపేస్తే ఇక ఆటేముంది? థ్రిల్ కావాలంటే చంపకూడదు. కొద్దికొద్దిగా హింసిస్తూ ఎంజాయ్ చేయాలి" అన్నాడు రమేష్. అతనికీ ఆట విస్కీకన్నా మత్తుగా ఉంది. స్క్రీన్ మీద ఆ అమ్మాయి నరకయాతన అనుభవించేకొద్దీ అతనికి కిక్కెక్కుతోంది.

★ ★ ★

కాలేజీ వదిలాక రమేష్, రవి మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ బస్టాప్ వైపు

నడుస్తున్నారు.

"ఈ రోజు శీనుగాడు రాలేదేమిట్రా?" అడిగాడు రవి.

"ఔన్రా. మనం ఓసారి వాళ్ళింటికెళ్ళి వాకబు చేద్దాం" అంటూ అటు వైపుగా వేగంగా వెళ్తున్న బైక్ వైపు చూసి, "ఆబైక్ చూడరా ... ఎంతందంగా ఉందో" అన్నాడు రమేష్.

బైక్ వెనక సీట్లో అందమైన అమ్మాయి... ఆ అబ్బాయి నడుం చుట్టూ చేయి వేసి... కిలకిలా నవ్వుతూ...

"ప్చ్... మనకూ అలాంటి బైక్ ఉంటేనా.... మనకా అదష్టం లేదురా. మీ నాన్న కార్పెంటర్. మానాన్న ఎకౌంటెంట్. ఛీ ఎదవ బతుకు. పూర్వ జన్మలో ఏదో పాపం చేసి ఉంటాంరా. అందుకే ఇలాంటి తల్లిదండ్రులకు పుట్టాం" అన్నాడు రవి.

"మన శీను గాడికి వాళ్ళ నాన్న బైక్ కొనిస్తానన్నాడట"

"వాడికేంరా అదృష్టజాతకుడు. వాడి సెల్ చూశావా... పాతిక వేలు."

"నాకెప్పటినుంచో కోరికరా. అలాంటి సెల్లో స్టైల్‌గా అమ్మాయిల్తో కబుర్లు చెప్తూ... అవసరమైతే వాళ్ళ ఫోటోలు తీసుకుంటూ..."

"న్యూడ్ ఫోటోలా?" అంటూ నవ్వాడు రవి. "మొన్న న్యూస్ చూశావా? ఢిల్లీలోని ఒక స్కూల్ విద్యార్థి తన క్లాస్‌లోని అమ్మాయితో సెక్స్ గేమ్ ఆడుతూ దాన్ని సెల్‌ఫోన్లో రికార్డ్ చేసి నెట్లో పెట్టాడట. థ్రిల్ కదా. మనమూ కాలేజీ కొచ్చాం. ఏం లాభం? దేనికైనా డబ్బుండాలిరా"

"ఇప్పుడందరికీ ఆరు వేళ్ళున్నాయిరా... మనిద్దరికీ తప్ప"

రవి అర్థం కాక రమేష్ వైపు చూసాడు.

"అర్థం కాలేదా? అటు చూడు ఆటోవాడి చేతిలో సెల్లుంది. ఇటు చూడు

కూరగాయలమ్మే వాడి దగ్గర కూడా సెల్లుంది. రోడ్డు మీద ఇంత మంది జనాలున్నారు కదా... సెల్లు పట్టుకోని చేయి ఎక్కడైనా కన్పిస్తుందేమో చూడు. మనిషికిపుడు ఆరో వేలు సెల్. మనిద్దరికీ ఐదు వేళ్ళే" బాధగా అన్నాడు రమేష్.

"నిజమేరా. సెల్లో ఇపుడు నెట్ సర్ఫింగ్ కూడా చేయవచ్చుట. మనకిష్టమైన గేమ్స్‌ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ మధ్య మరో కొత్త వీడియో గేమ్ వచ్చిందట తెలుసా"

"ఏంటది?"

"దాని పేరు 'గ్రాండ్ థెఫ్ట్ ఆటో: వైస్ సిటీ'. ఈ గేమ్‌లో విజేతకందే బహుమానం ఏమిటో తెలిస్తే పిచ్చెక్కిపోతుంది. ఓ వేశ్యతో సెక్స్‌ని ఎంజాయ్ చేసే అవకాశం... సెక్స్ కోరిక తీరాక డబ్బులు చెల్లించాల్సిన అగత్యం రాకుండా ఆమెను హత్య చేసేయొచ్చుట."

"వింటుంటేనే ఎంత బావుందో... ఎక్కడైనా సంపాయించరా ఈ గేమ్‌ని"

పెద్ద శబ్దం...బాంబు పేలినట్లు... ఇద్దరూ ఉలిక్కిపడి శబ్దం వచ్చిన వైపు చూశారు. అంబాసిడర్ కారు స్కూటర్ని ఢీకొట్టింది. స్కూటర్ నడుపుతున్న నలభైయేళ్ళ వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెనుక కూచున్న పదిహేనేళ్ళ అమ్మాయికి బాగా గాయాలయ్యాయి. ఆ అమ్మాయి తన గాయాల్ని పట్టించుకోకుండా "నాన్నా... నాన్నా" అంటూ హృదయవిదారకంగా ఏడుస్తోంది.

నిముషాల్లో మనుషులు చుట్టూ మూగారు. న్యూస్ ఛానెల్ వాళ్ళు హుటాహుటిన సంఘటనా స్థలాన్ని చేరుకున్నారు. రోడ్డుకి మధ్యలో పడిపోయి ఉన్నాడతను. తల చుట్టూ మడుగు కట్టిన రక్తం... అతన్ని వివిధ భంగిమల్లో షూట్ చేస్తున్నారు. కెమేరాని జూమ్ చేసి క్లోజ్ షాట్స్ తీస్తున్నారు.

"మా నాన్నని ఆస్పత్రికి తీసుకెళ్ళండి, మానాన్న బతికే ఉన్నాడు. ప్లీజ్... ఆలస్యం చేస్తే చచ్చిపోతాడు. మీకు దండం పెడ్తాను" ఏడుస్తూనే వేడుకుంటోందా

అమ్మాయి.

టీవి అతను మైక్‌ని ఆ అమ్మాయికి దగ్గరగా పెట్టి, "నీ పేరేంటి? ఈ యాక్సిడెంట్ ఎలా జరిగింది? తప్పెవరిది? కారు నడిపే అతనిదా?" లాంటి ప్రశ్నలడుగుతున్నాడు. గుండెల్ని కుదిపేసే ఆమె ఏడుపుని కెమేరామేన్ రకరకాల యాంగిల్స్‌లో బంధిస్తున్నాడు.

రమేష్, రాము గుంపుని ఛేదించుకుని వెళ్ళి అక్కడి దృశ్యాన్ని చూశారు. రమేష్‌కి తాను టీవీలో రోజూ చూసే దృశ్యంలానే అన్పించింది. మడుగు కట్టిన రక్తం తక్కువగా ఉన్నందుకు కొద్దిగా నిరాశగా కూడా అన్పించింది.

గాయాల్తో చావుబతుకుల మధ్య పడి ఉన్న ఆ వ్యక్తి గానీ, రక్తపు కన్నీళ్ళు కారుస్తున్న ఆ అమ్మాయిగానీ అతనిలో ఏ రకమైన స్పందననీ కలిగించలేక పోయాయి.

ఓ నిముషం అక్కడ నిలబడి మరలా బస్టాప్ వైపుకు నడక సాగించిన వాళ్ళిద్దరూ మరు నిముషమే అక్కడ జరిగిన ఘోరాన్ని మర్చిపోయి ఏ మోడల్ సెల్‌ఫోన్ కొంటే మంచిదనే చర్చలో పడ్డారు.

"నాకూ ఓ కోరికుందిరా. పబ్‌కెళ్ళి, మందు కొట్టి, జీన్స్ ప్యాంట్ వేసుకున్న మోడర్న్ అమ్మాయితో డిస్కో చేయాలని"

"కోరికలు తీరాలంటే డబ్బులు కావాలి. దానికి మనం ఏదైనా మార్గం వెతకాలి" అన్నాడు రమేష్..

బస్సు దిగాక ఇళ్ళకెళ్ళేముందు దార్లోనే ఉన్న శీను ఇంటికెళ్ళి కాలింగ్ బెల్ నొక్కారు.

పధ్నాలుగేళ్ళ క్షితిజ తలుపు తీసింది." మీ అన్నయ్య ఇంట్లో లేడా?" రమేష్ అడిగాడు.

"లేడు"

"ఎక్కడికెళ్ళాడు?"

"చుట్టాలొస్తే రామోజీ ఫిల్మ్ సిటీ చూపించడానికి పిల్చుకెళ్ళాడు"

నవ్వుతూ సమాధానం చెప్తున్న ఆ పిల్ల వైపు చూస్తున్న రమేష్ మెదళ్లో ఆలోచనల విషం... తాను చూసిన వీడియో గేమ్ 'రూల్ ఆఫ్ రోజ్' పాములా మెలికలు తిరుగుతూ....

★ ★ ★

ఉదయం స్కూలుకని వెళ్ళిన క్షితిజ సాయంత్రం తిరిగి రాలేదు.

పిల్ల ఏమైపోయిందోనని కంగారు పడ్తున్న ఆమె తండ్రికి ఫోనొచ్చింది. 'లక్షరూపాయలిస్తే క్షేమంగా వదిలేస్తాం... లేదా చంపేస్తాం' అని.

రమేష్, రవీ శీనుకి తోడుగా వాళ్ళింట్లోనే ఉండిపోయారు.

"ఒరేయ్...మీ నాన్నకు చెప్పరా. లక్షరూపాయలు పెద్ద డబ్బేం కాదు. మరలా సంపాయించుకోవచ్చు. ఇచ్చేయమని చెప్పరా. పోలీసులకు చెప్పొద్దని చెప్పు. లేకపోతే మన పిల్ల మనకు ప్రాణాల్తో దక్కదు" అన్నాడు రమేష్.

"మనం ఆడిన వీడియో గేమ్ గుర్తొచ్చి భయమేస్తోందిరా. మనం చేసినట్లు ఆ కిడ్నాపర్లు ఒక్కో భాగాన్ని కోసి మా యింటికి పార్శెల్ పంపిస్తారేమో" ఏడుస్తూ చెప్పాడు శీను.

"అందుకేరా... మీ నాన్నకు నచ్చచెప్పు. వాళ్ళడిగిన లక్ష రూపాయలు వాళ్ళ మొహాన కొట్టమను" అన్నాడు సముదాయిస్తూ.

చీకటి పడ్డాక సాహెబ్‌నగర్ చేరుకున్నారు రమేష్, రవీ. అక్కడ ఇళ్ళు దూరంగా విసిరేసినట్లు ఉన్నాయి. తాము నెలక్రితం అద్దెకు తీసుకున్న యింట్లోకి వెళ్ళారు. గదిలో నేలమీద కాళ్ళూ చేతులు కట్టేసి పడి ఉన్న క్షితిజ...

"లక్ష రూపాయలు ఇస్తాడంటావా?" రవి అడిగాడు.

"వాడేంటి వాడి బాబుకూడా ఇస్తాడు" అన్నాడు రమేష్.

"ఇవ్వనంటే..."

"సింపుల్. మొదట ఓ వేలు తెగ్గొట్టి పార్శెల్ చేద్దాం. అప్పటికీ వినకపోతే చేయి నరికేసి పంపిద్దాం"

"డబ్బులు చేతికందిన వేంటనే ఈ పిల్లని వదిలేద్దాం"

"కొంపలంటుకుంటాయి. క్షితిజ తెలివి గలది. మనం జేబు రుమాళ్ళు మొహాలకు కట్టుకున్నా మన గొంతుల్ని బట్టి గుర్తు పట్టింది. చంపేయటమే మనిద్దరికీ సేఫ్. ఇక్కడే పూడ్చేద్దాం. మనిద్దరం శీనుకి ఫ్రెండ్స్ కాబట్టి మనమీద ఎవ్వరికీ అనుమానం రాదు." ఆ వూహకే రమేష్ కళ్ళు వింత కాంతితో మెరిశాయి. కిడ్నాప్ చేస్తేనే ఇంత థ్రిల్ గా ఉంటే చంపేస్తే ఇంకెంత థ్రిల్ గా ఉంటుందో....

లక్ష రూపాయలతో రెండు సెల్ ఫోన్లు, ఒక బైక్ కొనాలని కలలు కంటున్న వాళ్ళిద్దరికీ చుట్టుముడ్తున్న పోలీసుల అలికిడి విన్పించే అవకాశమే లేదు.

వస్తు వ్యామోహం దట్టమైన పొరలుగా అడ్డుపడ్తున్న వాళ్ళ కళ్ళకి వాళ్ళని కబళించడానికి పొంచి ఉన్న చీకటి గురించిన స్పృహే లేదు.

***(వార్త ఆదివారం. 5 ఆగస్ట్ 2007)***

★ ★ ★